నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 31 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

పెండింగ్ సమస్యలపై గళం వినిపిస్తాం..

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా

ఖమ్మం, జనవరి 30 : పార్లమెంట్ చివరి సమావేశాల్లో పెండింగ్ సమస్యలపై తమ గళాన్ని మరింత బలంగా వినిపిస్తామని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పార్టీ పార్లమెంటరీ నేత కే.కేశవరావు, లోక్ సభా పక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. కేంద్రం వద్ద ఎన్నో పెండింగ్ సమస్యలున్నాయని, వాటిపై ప్రతి లోక్‌సభ సమావేశాల్లోనూ ప్రస్తావించి, తెలంగాణ వాణిని ఎంతో బలంగా వినిపించామని చెప్పారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పెండింగ్ నిధులు, ప్రాజెక్టులు తదితర అన్ని పెండింగ్ అంశాలపై పెద్ద ఎత్తున పోరాటం చేశామని నామా పేర్కొన్నారు.

స్టాక్ వివరాలను అప్‌లోడ్ చేయాలి

ప్రభుత్వ నిబంధనలను వ్యాపారులు తప్పక పాటించాలి

జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 30 (నమస్తే తెలంగాణ): వ్యాపారులు తమ వద్ద నిత్యావసర వస్తువుల స్టాక్ వివరాలను ప్రతీ శుక్రవారం ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని అన్నారు. జిల్లా అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్, వర్తక, వాణిజ్య వ్యాపారులతో కలిసి ఐడీవోసీలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1,59,432 ఎకరాల్లో వరి సాగవుతోందని, 90 శాతం రైతులు సన్నబియ్యపు ధాన్యాన్ని, మిగిలిన 10 శాతం దొడ్డు రకం ధాన్యాన్ని పండిస్తున్నారని అన్నారు. అలాగే జిల్లాలో 6 వేల ఎకరాల్లో పప్పు దినుసుల పంటలు పండిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో వరి సాగు ఎక్కువ జరుగుతోందని అన్నారు. ధాన్యం, పప్పులు, వంట నూనెల స్టాక్ వివరాలను తప్పకుండా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. దాంతోపాటు ఆ వివరాల నివేదికను జిల్లా పౌర సరఫరాల అధికారికి అందజేయాలని సూచించారు. నిత్యావసర వస్తువులు అక్రమంగా దాచిపెట్టి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పౌరసరఫరాల అధికారులు కూడా నిత్యం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యాన సాగులో కూరగాయల సాగుకు రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బియ్యం, పప్పు దినుసులు, నూనె ధరల్లో నిరుటికి, ఈ ఏడాదికి ఉన్న వ్యత్యాసాలను వివరించారు. అందుకుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువులను కొరత రావొద్దని, ప్రజలకు కావాల్సిన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచడం వ్యాపారుల బాధ్యతని అన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు రుక్మిణిదేవి, త్రినాథ్‌బాబు, అభిమన్యుడు, జినుగు మరియన్న, ఆలీం, సునీత పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ శిబిరంపై మావోయిస్టుల దాడి

- ఇరువర్గాల పోరులో ముగ్గురు జవాన్లు మృతి
- మరో 15 మందికి గాయాలు
- సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దు టేకులగూడ వద్ద ఘటన

కొత్తగూడెం క్రైం, జనవరి 30 : తుపాకుల మోతలతో దండకారణ్యం దద్దరిల్లిపోయింది. మావోయిస్టులు ఒక్కసారిగా జవాన్లపై మెరుపు దాడికి దిగడంతో జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. సీఆర్‌పీఎఫ్ కొత్త శిబిరం ప్రారంభం రోజే ఇరువర్గాల మధ్య జరిగిన భీకర పోరులో ముగ్గురు జవాన్లు నేలకొరిగారు. మరో 15 మంది గాయాలతో బయటపడ్డారు. మావోయిస్టుల దాడితో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో రెడ్ అలర్ట్ మోగింది. వివరాల్లోకి వెళితే... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దు టేకులగూడ వద్ద సీఆర్‌పీఎఫ్, పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం నూతన సీఆర్‌పీఎఫ్ క్యాంపును ప్రారంభించారు. తర్వాత భద్రతా చర్యల్లో నిమగ్నమైన సైనికులు అక్కడి నుంచి జునాగూడ-అలిగూడ ప్రాంతంలో పెట్రోలింగ్‌కి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన మావోయిస్టులు సుమారు వంద మందికి పైగా సాయుధులుగా వచ్చి టేకులగూడ శిబిరంపై మెరుపు దాడికి దిగారు. బ్యారెల్ గ్రనేడ్ లాంచర్లు(బీజీఎల్) ప్రయోగిస్తూనే కాల్పులు జరుపుకుంటూ శిబిరంపై దండెత్తుకొచ్చి అక్కడ జనరల్ డ్యూటీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ జవాన్లపై కాల్పులు జరిపారు. దాడిని ఊహించని జవాన్లు కాస్త ఆలస్యంగా తేరుకొని ఎదురు కాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నరపాటు భీకరపోరు కొనసాగినట్లు తెలుస్తోంది. మావోయిస్టులు బ్యారెల్ గ్రనేడ్ లాంచర్లను ప్రయోగించినప్పటికీ జవాన్లు ధీటుగానే ఎదుర్కొన్నారు. సమాచారం మేరకు అక్కడికి అదనపు భద్రతా దళాలు రావడాన్ని గమనించిన మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారు. మావోయిస్టులు జరిపిన మెరుపు దాడిలో ముగ్గురు జవాన్లు.. కోబ్రా 201 బెటాలియన్‌కు చెందిన జవాన్లు దేవాన్ సీ, పవన్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ 150 బెటాలియన్‌కు చెందిన లంబాధర్ సిన్హా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మరో 15 మంది జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హెలికాప్టర్ ద్వారా మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించినట్లు ఈ ఘటనపై స్పందించిన బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం ధ్రువీకరించారు. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2021లో ఇదే ప్రాంతంలో మావోయిస్టులు జరిపిన మెరుపు దాడిలో 23 మంది జవాన్లు వీరమరణం పొందారని ఐజీ తెలిపారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో మావోయిస్టుల చొరబాటును నిర్వీర్యం చేసేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తూనే ఉందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం టేకులగూడలో నూతన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాగా.. నెల రోజులుగా ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు రణరంగంగా మారిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జరిగిన ఘటనతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. సుక్మా-బీజాపూర్ జిల్లా సరిహద్దులో భారీగా పారా మిలటరీ బలగాలు మోహరించాయి. మావోయిస్టుల చర్యలను నిర్మూలించేందుకు కేంద్రం కొత్త పంథాలో వెళ్తున్నా.. తరచూ జవాన్ల శిబిరాలపై దాడులకు పాల్పడుతుండడం గమనార్హం.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాల్లో అధికారులు ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు మార్గదర్శకాలు వచ్చాయా అని అధికారులను ఆరాతీశారు. సమావేశాలకు ఎప్పటిలాగానే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరుకాలేదు. వివిధశాఖల జిల్లా అధికారులు సైతం సమావేశాలకు రాలేదు. దీంతో జడ్పీ చైర్మన్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ సమావేశాలకు హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి బోధనాసుపత్రిగా ప్రభుత్వ వైద్య విద్య కళాశాలకు అనుసంధానం కావడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రి ఎక్కడ ఏర్పాటు చేస్తారని జడ్పీ చైర్మన్ కమల్‌రాజు ప్రశ్నించగా ఖమ్మం-వైరా మధ్యలో కనీసం 5 నుంచి 10 ఎకరాల స్థలం సమకూర్చితే ఆసుపత్రి నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన సీఐలు

సీపీ సునీల్‌దత్‌ను కలిసిన సీఐలు

మామిళ్లగూడెం, జనవరి 30: ఇటీవలి బదిలీల్లో భాగంగా నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించిన పలువురు సీఐలు ఖమ్మంలో సీపీ సునీల్‌దత్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించారు. సీపీని కలిసిన వారిలో ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఖానాపురం హవేలీ, సత్తుపల్లి, సీసీఎస్‌ల సీఐలు ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, రమేశ్, భానుప్రకాశ్, కిరణ్, సత్యనారాయణలు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి సీపీ పలు సూచనలు చేశారు.

రేషన్‌కార్డు ఈ-కేవైసీ గడువు పెంపు

- ఫిబ్రవరి నెలాఖరు వరకు అవకాశం
- ఖమ్మం జిల్లాలో 76.99 శాతం నమోదు
- రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచిన జిల్లా

ఖమ్మం, జనవరి 30 : దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి ప్రభుత్వం నెలనెలా చౌక దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఆహార భద్రతా కార్డుల్లో ఎంతో మంది అనర్హులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. కార్డుల్లో పేరున్న వారిలో కొందరు మరణించొచ్చు. మరి కొందరు శాశ్వతంగా ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయి ఉండొచ్చు. ఇంకొందరు వివాహం చేసుకుని ఆ ఇంటి నుంచి వెళ్లి ఉండొచ్చు. అయినప్పటికీ వారి పేరుపై కుటుంబ సభ్యులు రేషన్ తీసుకుంటున్నట్లు కేంద్రం నిర్ధారణకు వచ్చి, బోగస్ కార్డుల ప్రక్షాళనకు ఈ-కేవైసీ ప్రక్రియకు తెర తీసింది. గతేడాది సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్రం ఈ నెలాఖరు వరకే గడువు అని ముందుగా ప్రకటించింది. కానీ.. లక్షలాది మంది ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉండడంతో గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకు పెంచింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆహార భద్రత కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది.

నమోదులో 7వ స్థానంలో జిల్లా..

రేషన్ కార్డు ఈ-కేవైసీ నమోదులో ఖమ్మం జిల్లా 7వ స్థానంలో ఉంది. మేడ్చల్ జిల్లా 92.48 శాతం నమోదుతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లా 86.45 శాతం సాధించి రెండో స్థానం, హైదరాబాద్ జిల్లా 85.30 శాతంతో మూడోస్థానం, కరీంనగర్ 82.86 శాతంతో నాలుగో స్థానం, నిర్మల్ 77.72 శాతంతో ఐదో స్థానం, సంగారెడ్డి 77.10 శాతంతో ఆరోస్థానం, ఖమ్మం జిల్లా76.99 శాతంతో ఏడో స్థానంలో నిలిచాయి. అలాగే పొరుగు జిల్లా భద్రాద్రి 70.01 శాతం నమోదును సాధించింది. 61.79 శాతం నమోదు చేసి మహబూబాబాద్ జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచింది.

జిల్లాలో 76.99 శాతం నమోదు..

జిల్లావ్యాప్తంగా మొత్తం రేషన్ దుకాణాలు 748 ఉండగా.. వీటి పరిధిలో 4,11,347 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఆయా కార్డులపై మొత్తం 11,32,871 మంది పేర్లున్నాయి. ఆదివారం నాటికి వీరిలో 8,72,197 మంది మాత్రమే ఈ-కేవైసీ పూర్తి చేశారు. నమోదు శాతం 76.99. 100 శాతం ప్రక్రియ పూర్తి కావాలంటే ఇంకా 2,60,674 మంది సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉన్నది.

'రేషన్' తగ్గించే కుట్రలకు తెర?

రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణానికి వెళ్లి డీలర్ వద్ద ఈ-పాస్ మిషన్‌లో ఈ-కేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియతో ఆహార భద్రత కార్డులను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. బతుకుదెరువు కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన వారైనా, ఉన్నత చదువుల కోసం వెళ్లిన వారైనా ఉన్నఫళంగా వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాలంటే ఇబ్బందే. సాధారణంగా వారంతా సెలవులు వస్తే స్వస్థలాలకు వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాలనుకుంటారు. మరోవైపు ఈ-కేవైసీ చేయించుకోని వారి పేర్లను కార్డు నుంచి తొలగిస్తారనే అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయి. ఈ విషయంలో అధికారులు సరైన స్పష్టత ఇవ్వడం లేదనే భావన ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది.

3న మెగా జాబ్ మేళా : కలెక్టర్ గౌతమ్

జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం సిటీ, జనవరి 30 : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో చేపట్టనున్న జాబ్‌మేళా ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 65కి పైగా కంపెనీలు ఈ మేళాలో పాలుపంచుకుంటున్నాయని తెలిపారు. 5వేలకు పైగా ఉద్యోగాలకు నియామకం చేసుకుంటారని, నిరుద్యోగ యువతకు ఇది సువర్ణావకాశమని కలెక్టర్ పేర్కొన్నారు. 18-35 ఏళ్ల వయసు కలిగి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, అన్ని విభాగాల డిప్లొమా, బీఫార్మసీ, అన్ని విభాగాల ఎంఫార్మా, హోటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్, ఎంసీఏ, ఎంబీఏ, ఎంసీఎస్, బీఈ, బీటెక్, ఎంటెక్ విభాగాల్లో ఉత్తీర్ణత కలిగిన వారు జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, హెల్ప్‌లైన్ నెంబర్లు 88867 11991, 96423 33668 ద్వారా సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కే.శ్రీరాం, అదనపు పౌరసంబంధాల అధికారి వీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలేరుకు సాగర్ నీరు

- తాగునీటి కోసం విడుదల చేయనున్న అధికారులు
- మూడు జిల్లాలకు ఇక్కడినుంచే తాగునీరు
- వేసవి వరకు 1.5 టీఎంసీలు అవసరం

అడుగంటిన పాలేరు రిజర్వాయర్

కూసుమంచి, జనవరి 30 : మూడు జిల్లాలకు తాగునీరు అందించే పాలేరు రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో బుధవారం మధ్యాహ్నం సాగర్ జలాశయం నుంచి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. సోమవారమే సాగర్ డ్యామ్ నుంచి నీరు విడుదల కావాల్సి ఉన్నప్పటికీ అధికారికంగా ఆదేశాలు రాకపోవడంతో మంగళవారం విడుదల చేస్తారని భావించారు.. కానీ బుధవారం మధ్యాహ్నం నీరు విడుదల చేసేందుకు ఆదేశాలు జారీచేశారు. దీంతో సాగర్ నుంచి తొలుత 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి క్రమంగా పెంచుతూ 4వేల క్యూసెక్కుల వరకు నీటిని వదులుతారు. పాలేరు నుంచి మూడు జిల్లాలకు తాగునీటి అవసరాలకు గాను నీటిని విడుదల చేయాలని వారంరోజుల కిందటే మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇరిగేషన్ శాఖను కోరారు. పాలేరు డెడ్ స్టోరేజి అయ్యే వరకు ఆదేశాలు రాకపోవడంతో పరిస్థితి ఒకటి రెండురోజుల్లో చేజారిపోయే ప్రమాదం ఉన్నందున నీటిని విడుదల చేస్తున్నారు. పాలేరు పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులు, నీటి సామర్థ్యం 2.588 టీఎంసీలు. మంగళవారం సాయంత్రానికి పాలేరు నీటిమట్టం 11.50 అడుగులు అంటే డెడ్‌స్టోరేజికి చేరుకుంది. నీటి సామర్థ్యం 0.90 టీఎంసీలు మాత్రమే ఉంది. మరో అర అడుగు నీటిమట్టం పడిపోతే మిషన్ భగీరథకు తాగునీరు అందదు.

ప్రతిరోజు 170 క్యూసెక్కులు..

పాలేరు జలాశయం నుంచి మూడు జిల్లాల తాగునీటి అవసరాలకు రోజుకు 126 క్యూసెక్కుల నీటిని తీసుకొంటారు. షట్టర్లు లీకుల ద్వారా 20 క్యూసెక్కులు, పాలేరు రిజర్వాయర్ చుట్టూ ఉన్న మోటర్ల ద్వారా మరో 25 క్యూసెక్కుల నీరు మొత్తం 170 క్యూసెక్కుల నీరు నిత్యం పాలేరు నుంచి విడుదల అవుతున్నది. ఇలా ప్రతి రోజు విడుదల అయ్యే నీటితో రోజుకు 0.20 అడుగుల మేర పాలేరు నీటి మట్టం తగ్గుతుంది. వేసవిలో అయితే ఎండ తీవ్రత వల్ల నీరు ఎక్కువగా ఆవిరి అవుతుంది కాబట్టి రోజుకు కనీసం 200 క్యూసెక్కులపైన నీరు కావాల్సి ఉంటుంది.

గురువారం అర్ధరాత్రికి పాలేరుకు సాగర్ జలాలు..

సాగర్‌లో బుధవారం వదిలిన నీరు 135 కిలోమీటర్లు ప్రయాణించి గురువారం అర్ధరాత్రికి పాలేరు రిజర్వాయర్‌కు చేరుకునే అవకాశం ఉంది. పాలేరు కింద గల మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం వేసవి వరకు తాగునీటి కొరత తీరాలంటే 1.50 టీఎంసీల నీరు కావాల్సి ఉంది. నీరు విడుదలైన తరువాత నీటిని ఎక్కడా వాడకుండా, ట్యాంపరింగ్ జరగకుండా అధికారులు సాగర్ నుంచి పాలేరు వరకు కాలువలపై గస్తీ ఏర్పాటు చేస్తున్నారు. తూములు, షట్టర్లు, మేజర్లు, మైనర్ల కాలువల వద్ద కాపలా ఉంచి నీటిని పాలేరు వరకు వచ్చేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాకు 240 మంది స్టాఫ్ నర్సులు

- కౌన్సెలింగ్ ద్వారా విధుల కేటాయింపు
- నర్సులకు ఐడీ కార్డులు అందజేసిన డీఎంహెచ్‌వో

స్టాఫ్ నర్సులకు ఐడీ కార్డులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : వైద్య శాఖలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులు ఎట్టకేలకు భర్తీ కానున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రాత పరీక్ష నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం పరీక్ష ఫలితాలు విడుదల చేయడంతో నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో అధికారికంగా వెలువడిన ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 240 మందిని ఎంపిక చేశారు. వారికి అక్కడే నియామక పత్రాలను అందజేయగా.. స్థానిక డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష జిల్లా కార్యాలయంలో ఐడీ కార్డులను వారికి అందజేశారు.

కౌన్సెలింగ్ ద్వారా విధుల కేటాయింపు

కొత్తగా ఏర్పాటైన జిల్లాలో గతంలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి ఉండేది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడంతో ఏజెన్సీ ప్రాంతానికి తొలిసారిగా మెడికల్ కాలేజీ మంజూరుతోపాటు నర్సింగ్ కళాశాల కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఏరియా ఆస్పత్రి జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. దీనికి అనుసంధానంగా వందపడకల మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి బీజం పడింది. అయితే ఇందులో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్ కూడా రావడంతోపాటు పోస్టుల భర్తీకి రాత పరీక్ష కూడా నిర్వహించారు. వాటి ఫలితాలు వెలువడడంతో జిల్లాలో ప్రస్తుతం 240 స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ కానున్నాయి. మరో వారం రోజుల్లో కౌన్సిలింగ్ పూర్తి కాగానే కొత్తగా ఆర్డర్లు తీసుకున్న స్టాఫ్ నర్స్‌లు జిల్లా ఏరియా, జనరల్ ఆస్పత్రిలో విధుల్లో చేరనున్నారు.